

కాంట్రాక్టు లెక్చరర్ల నిరసన

కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని కుక్టా జేఏసీ చైర్మన్ పి.కరుణాకర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

- 8లో▸



ఆర్ట్స్ కళాశాలలో గొడవ

హనుమకొండ ఆర్ట్స్ కళాశాలలో విద్యార్థుల మధ్య గొడవ జరిగింది. దీంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

- 8లో▸

గరిష్టం/కనిష్టం $34^0/23^0$

వాతావరణం

ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ, ఉక్కపోత ఉంటుంది. సాయంత్రం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు కస్తూర్బా విద్యార్థినులు



దుగ్గొండి: మండలంలోని మల్లంపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి చెందిన ఇద్దరు విద్యార్థినులు రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మంజుల తెలిపారు. ఈనెల 3న నిర్వహించిన జిల్లాస్థాయి రగ్బీ పోటీల్లో క్యాతరబాజీ వర్ష, దామెర సమీర పాల్గొని ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈమేరకు శనివారం పాఠశాలలో వర్ష, సమీరను పాఠశాల ప్రిన్సిపాల్ మంజుల, ఉపాధ్యాయినులు స్రవంతి, సరస్వతి, అనూష, సుభాషిణి, సంధ్య, పుష్పలీల, కవిత, రాధిక, రమ్య తదితరులు అభినందించారు.

మూడు పాఠశాలల్లోనే అల్పాహారం



కాశిబుగ్గ/కాజీపేట/ కాశీ సెంటర్: ప్రభుత్వం నియోజకవర్గానికి ఒకటి చొప్పున పాఠశాలను ఎంపిక చేసి విద్యార్థులకు అల్పాహారం అందిస్తోంది. ఇందులో భాగంగా వరంగల్ మట్టెవాడలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు, నర్సంపేట పాకాల రోడ్డులోని జిల్లా పరిషత్ మోడల్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు, వర్ధన్నపేట మండలం ఇల్లందలోని జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో మాత్రమే విద్యార్థులకు ఉదయం అల్పాహారం అందిస్తున్నారు. దసరా సెలవులు ప్రకటించేవరకూ తాత్కాలికంగా ఈ పాఠశాలల్లోనే ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. దసరా సెలవుల అనంతరం ఈనెల 24 నుంచి జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అల్పాహారం అందజేస్తామని డీఈఓ వాసంతి తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాశీ సెంటర్ : జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిన పనిచేసేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రీజినల్ కోఆర్డినేటర్ విద్యారాణి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుతోపాటు అర్హత ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ ప్రతులపై గెజిటెడ్ అధికారి సంతకం చేయించి ఈనెల 9 నుంచి 23 తేదీలోపు హనుమకొండలోని సర్క్యూట్ గెస్ట్‌హౌస్ ఎదురుగా ఉన్న రీజినల్ కోఆర్డినేటర్ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. ల్యాబ్ అసిస్టెంట్, కంప్యూటర్ ల్యాబ్ అసిస్టెంట్ ఉద్యోగాలకు గుర్తింపు పొందిన యూనివర్సిటీలో మొదటి స్థానంలో ఉత్తీర్ణత సాధించినవారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



గీసుకొండ : నేషనల్ హెల్త్ మిషన్ స్కీం కింద పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సర్వీస్‌ను రెగ్యులరైజ్ చేసి, సమస్యలను పరిష్కరించాలని సంఘం (ఏఐటీయూసీ అనుబంధ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామా రాజేశ్ ఖన్నా కోరారు. ఈ మేరకు శనివారం డీఎంహెచ్‌ఓ కె.వెంకటరమణకు యూనియన్ నాయకులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మె కాలంలో ఇచ్చిన హామీని నెరవేర్చాలని, ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ ఈ నెల 9న హైదరాబాద్‌లోని డీహెచ్ కార్యాలయం వద్ద మహాధర్నా నిర్వహిస్తామని పేర్కొన్నారు. నాయకులు నూర సంపత్‌కుమార్, పృథ్వీ పాల్గొన్నారు.

పరీక్షలంటే భయం వద్దు



రాయపర్తి : సమ్మెటివ్ అసెస్‌మెంట్–1 పరీక్షలంటే విద్యార్థులు భయాందోళన చెందొద్దని డీసీఈబీ సెక్రటరీ గారె కృష్ణమూర్తి సూచించారు. మండల కేంద్రంతోపాటు మండలంలోని మైలారం, పానీష్‌తండా ప్రాథమిక పాఠశాలలను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ ఈనెల 5 నుంచి 11 వరకు నిర్వహిస్తున్న పరీక్షలను బాగా రాయాలని కోరారు. జవాబు పత్రాలను ఎప్పటికప్పుడు మూల్యాంకనం చేసి విద్యార్థులకు ఫలితాలు అందజేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. హెచ్‌ఎం ఉమాదేవి ఉన్నారు.

పక్కాగా పంటల నమోదు

- జిల్లాలో 59 క్లస్టర్లు.. 3,12,592 ఎకరాల్లో పంటలు
- పూర్తయిన సాగు సర్వే.. ఆన్‌లైన్‌లో వివరాల నమోదు



నెక్కొండలో పంటల సాగు వివరాల నమోదును పరిశీలిస్తున్న ఏఓ నాగరాజు

నెక్కొండ : రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతల్లో వ్యవసాయరంగం మొదటి స్థానంలో ఉంది. 65 శాతానికి పైగా జనాభా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడిన ఈ రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేసింది. రాయితీలు, నష్టపరిహారం, ఇతర ప్రయోజనాలు పొందాలంటే అధికారుల వద్ద పంటల సాగు వివరాలు సమగ్రంగా ఉండాలి. ఇందుకోసం రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. రైతుల జీవన స్థితిగతుల మెరుగుదల కోసం ప్రణాళికలు రూపొందించింది. విధివిధానాలు రూపొందిచాలన్నా, అమలు చేయాలన్నా మనకున్న వనరుల లభ్యత, వనరుల కొరతపై అవగాహన ఉండాలి. అప్పుడే మెరుగైన ఫలితాలు వస్తాయని వ్యవసాయ అధికారులు భావిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేక యాప్‌ను అమల్లోకి తీసుకొచ్చి పంటల నమోదుకు శ్రీకారం చుట్టారు. క్షేత్రస్థాయికి వెళ్లి పంటల నమోదు చేపడితేనే ఈ యాప్‌లో వివరాలు నమోదయ్యేలా రూపొందించారు. దూరదృష్టితోనే ప్రభుత్వం ప్రతిగుంట భూమి లెక్క పక్కాగా ఉండాలని వ్యవసాయ శాఖకు దిశానిర్దేశం చేసింది. ఇక ప్రభుత్వం వెబ్‌పోర్టల్‌ను అభివృద్ధి చేసి రైతుల పంట విస్తీర్ణం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తోంది. జిల్లాలోని నీటి వనరులతో ప్రతి వానాకాలం, యాసంగిలో పత్తి, వరి, మొక్కజొన్న, పసుపు, తదితర పంటలను రైతులు సాగు చేస్తారు. కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధరతోపాటు వాటికి మార్కెట్ తదితర సౌకర్యాలను కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించిన విషయం విదితమే. పంటల నమోదు ప్రక్రియ జిల్లాలో చివరి దశకు చేరింది. కాగా, జిల్లాలోని 59 క్లస్టర్లు ఉండగా.. రైతులు 3,12,592 ఎకరాల్లో వివిధ పంటలు సాగుచేశారు.

నమోదు ప్రక్రియ ఇలా..

నమోదు ప్రక్రియలో భాగంగా ఒక గ్రామంలో ఎన్ని ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి, అందులో ఏఏ రకాలు వేశారు, ఎంత విస్తీర్ణంలో పండిస్తున్నారు, రైతులు ఎంత మంది ఉన్నారు అనే వివరాలను సేకరిస్తున్నారు. ఇలా ప్రతి అంశం పూర్తయిన తర్వాత వ్యవసాయ శాఖ అధికారులు సంబంధిత జాబితాను గ్రామ పంచాయతీల్లో ప్రదర్శించనున్నారు. ఆ గ్రామంలో రైతులు ఏ పంట వేశారో తెలియడంతోపాటు నమోదు కాని వారు మళ్లీ నమోదు చేసుకునే వీలుంటుంది. వీటితో పట్టాదారు పాస్‌పుస్తకం, సాగు చేస్తున్న పంటలు, ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్‌పుస్తకం, ఫోన్ నంబర్ ఇలా అన్ని వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఏ ప్రాంతంలో ఏ పంట బాగ పండుతుందో పరిశీలించి దానిని పెద్ద ఎత్తున సాగు చేసేందుకు ప్రోత్సహిస్తున్నారు. పంటలకు గిట్టుబాటు ధర, మార్కెట్ సౌకర్యంతో పాటు పరిశ్రమలను తీసుకొచ్చి ప్రాంతాల అభివృద్ధికి ఈ కార్యాచరణ రూపొందించినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

జిల్లాలో పంటల సాగు వివరాలు..	
పంట	ఎకరాలు
వరి	1,34,900
పత్తి	1,22,315
మిరప	8,248
మొక్కజొన్న	4,687
వేరుశనగ	874
ఆయిల్‌పామ్	3,095
పెసర	701
కంది	271
ఇతర పంటలు	37,501
మొత్తం విస్తీర్ణం	3,12,592

అధికారుల వద్ద రైతుల వివరాలు

పంట ఉత్పత్తులు, విక్రయాల సమయంలో రైతులు ఇబ్బంది పడుతున్నారు. కొంత మంది రైతులు ప్రత్యామ్నాయం లేక ఇతర రైతుల పేరిట పంటలను విక్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. సదరు రైతుకు బ్యాంకులో రుణం ఉంటే బ్యాంకులు పంట రాబడి నగదును జమ చేసుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఉన్న లెక్కలకు క్షేత్రస్థాయిలో ఉన్న పంటలకు పొంతన లేకపోవడంతో రాయితీలు, పథకాల అమలులో గందరగోళం ఏర్పడుతుంది. వీటన్నింటికి స్వస్తి చెప్పేందుకే పంట నమోదు కార్యక్రమాన్ని చేపట్టినట్లు అధికారులు చెబుతున్నారు. గ్రామాల వారీగా రైతులు, కౌలు రైతుల పేర్లు, సర్వేనంబర్, విస్తీర్ణం, ఏపంట సాగు చేశారన్న విషయాలు అధికారుల వద్ద ఉంటాయి.

59 క్లస్టర్లలో పంటల సర్వే పూర్తి



జిల్లాలో 59 క్లస్టర్లు ఉన్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లో రైతుల నుంచి వివరాలను ఇప్పటికే సేకరించాం. వివరాలను నమోదు చేశాం. మొత్తం 3,12,592 ఎకరాల్లో వివిధ పంటలు సాగువుతున్నాయి. పక్కాగా పంటల నమోదుతో రైతుకు అన్ని రకాలుగా మేలు చేకూరనుంది.

ఉషాదయాళ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

కాంగ్రెస్‌వి తుపాకీ రాముడి మాటలు

- ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డికి అధిక మెజార్టీ ఇవ్వాలి
- నెక్కొండ ప్రగతి సభలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



ప్రగతి సభలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

నెక్కొండ: కాంగ్రెస్ పార్టీవి తుపాకీ రాముడి మాటలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ధ్వజమెత్తారు. తనకు ఎన్టీఆర్, కేసీఆర్ సీఎంలు అంటే ఇష్టమని పేర్కొన్నారు. నెక్కొండ వ్యవసాయ మార్కెట్ ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన ప్రగతి సభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్..బోగస్, బ్రోకర్, అబద్ధాల పార్టీ అని మండిపడ్డారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో తెలంగాణలో ఉన్న పథకాలు అమలవుతున్నాయా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వాలు ఒకరు చనిపోతేనే ఇంకొకరికి పింఛన్ ఇచ్చేవని గుర్తుచేశారు. గతంలో నర్సంపేట నియోజకవర్గంలో తగాదాలు, హత్యలను కాంగ్రెస్ ప్రోత్సహించిందని చెప్పారు. అలాంటి నర్సంపేట ఇప్పుడు అభివృద్ధి వైపు పరుగులు తీస్తోందని తెలిపారు. మంత్రుల వద్ద కొట్లాడి మరీ నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తున్న ఘనత ఎమ్మెల్యే పెద్దికే దక్కుతుందని కొనియాడారు. వట్టి వాగుపై బ్రిడ్జిలు, చెక్‌డ్యాంల నిర్మాణానికి సీఎం కేసీఆర్ వద్ద, తన వద్ద విన్నవించుకోవడంతో ప్రభుత్వం నిధులు కేటాయించిందని తెలిపారు. నెక్కొండ మండలాన్ని రూ. 250 కోట్లతో అభివృద్ధి చేశారన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టే మేనిఫెస్టో దద్దరిల్లుతుందని చెప్పారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ నాయకులు నిద్రలేని రాత్రులు గడపాల్సి వస్తుందని ఆయన అన్నారు. పెద్దిని మరోసారి అధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. అనంతరం రైతులకు పంట నష్టపరిహారం చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. అంతకు ముందు వట్టి వాగుపై రూ.20 కోట్లతో చెక్‌డ్యాంతోకూడిన బ్రిడ్జిల పనులను మంత్రి ప్రారంభించారు. జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న, ఎంపీపీ జాటోతు రమేష్ నాయక్, జెడ్పీటీసీ లావుడ్యా సరోజ, పీపీ షేక్ అబ్దుల్‌నబీ, పీఏసీఎస్ చైర్మన్లు మారం రాము, జలగం సంపత్‌రావు, ఘంటా దామోదర్‌రెడ్డి, నర్సంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమ్ము రమేష్‌యాదవ్, బీఆర్‌ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు సంగని సూరయ్య, కొణిజేటి భిక్షపతి పాల్గొన్నారు.

విదేశీ పక్షులను తీసుకొస్తాం

- చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ భీమానాయక్

న్యూశాయంపేట: హనుమకొండ హంటర్ రోడ్డులోని కాకతీయ జూ పార్కును మరింత అభివృద్ధి చేస్తామని, విదేశీ పక్షులను తీసుకొస్తామని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ భీమానాయక్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వన్యప్రాణుల వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు డ్రాయింగ్, ఎస్సే రైటింగ్ పోటీలను స్వచ్ఛంద సంస్థల సౌజన్యంతో నిర్వహించి శనివారం బహుమతులు అందజేసినట్లు తెలిపారు. జూపార్కు అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో జనగామ అటవీ శాఖ అధికారి లావణ్య, వెటర్నరీ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, పురుషోత్తం, దేవాచారి, తదితరులు పాల్గొన్నారు.



జంతువుల నిర్వహణకు ఖర్చులు అందిస్తున్న ఆదర్శ కాలనీ అభివృద్ధి కమిటీ కార్యదర్శి వేణు

దత్తత తీసుకున్న ఆదర్శ కాలనీ..

హన్మకొండ: హనుమకొండ జూ పార్కులోని జంతువుల నిర్వహణను ఆదర్శకాలనీ అభివృద్ధి కమిటీ దత్తత తీసుకుంది. ఈమేరకు శనివారం కాకతీయ జూ పార్కులో జరిగిన సమావేశంలో ఒక సంవత్సరానికి జంతువుల నిర్వహణకు అయ్యే ఖర్చులను కాలనీ అభివృద్ధి కమిటీ కార్యదర్శి వేణు జూ పార్కు యాజమాన్యానికి చెక్కు అందజేశారు.

ఎన్నికల నియమావళిని అమలు చేయాలి

- పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి
- అధికారుల సమీక్షలో కలెక్టర్ ప్రావీణ్య



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

కరీమాబాద్: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి పి.ప్రావీణ్య ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, ఎక్సైజ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపులు, విద్యుత్, టాయిలెట్లు, మంచినీరు, ఫర్నిచర్ తదితర సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఎన్నికల విధులు నిర్వర్తించే సిబ్బంది కమిషన్ ఆధీనంలో పనిచేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. నోటిఫికేషన్ వెలువడిన వెంటనే ప్రవర్తన నియమావళి అమలులోకి రానుందని, ఈ నేపథ్యంలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేందుకు సిబ్బంది సమన్వయంతో పనిచేయాల్సి ఉంటుందని చెప్పారు. ఈక్రమంలోనే అధికారులు ఎన్నికల మార్గదర్శకాలను సంపూర్ణంగా అధ్యయనం చేయాలని సూచించారు. ఎన్నికల నివేదికలు సకాలంలో అందజేసేవిధంగా పనితీరు పెంపొందించుకోవాలని చెప్పారు. ఎన్నికల నిర్వహణ, నియమావళి ప్రకారం నియమించిన ఎఫ్‌ఎస్‌టీ, ఎస్‌ఎస్‌టీ, వీఎస్‌టీ, ఎంసీసీ టీంలు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ ప్రావీణ్య స్పష్టం చేశారు. సమావేశంలో ఈఆర్‌ఓలు షేక్‌రిజ్వాన్‌బాషా, అశ్వినితానాజీ, కృష్ణవేణి, డీసీపీ రవీందర్, అధికారులు పాల్గొన్నారు.


రేపటి ప్రజావాణి రద్దు

కరీమాబాద్ : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే ప్రజావాణిని రద్దు చేసినట్లు కలెక్టర్ ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. పరిపాలనా పరమైన కారణాల మూలంగా ప్రజావాణిని రద్దు చేస్తున్న నేపథ్యంలో ప్రజలు ఎవరూ కలెక్టరేట్‌కు రావొద్దని ఆమె సూచించారు.


మీడియా సెంటర్ ఏర్పాటుకు కలెక్టర్ పరిశీలన

కరీమాబాద్ : జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయాన్ని శనివారం కలెక్టర్ ప్రావీణ్య సందర్శించారు. ఎన్నికల నేపథ్యంలో మీడియా సెంటర్ ఏర్పాటు చేయడంలో భాగంగా కార్యాలయంలో ఏమైనా మరమ్మతులు చేయించాలని కలెక్టరేట్ ఏఓ శ్రీకాంత్‌ను ఆదేశించారు. కార్యాలయంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై సూచనలు చేశారు. కార్యక్రమంలో డీపీఆర్‌ఓ అయూబ్‌అలీ, ఎన్నికల సూపరింటెండెంట్ విశ్వనారాయణ, అడిషనల్ పీఆర్‌ఓ ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ నియామకం



మొగిలి, చైర్మన్



రాజేశ్వర్‌రావు, వైస్ చైర్మన్

నర్సంపేట : నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జీఓ నంబర్ 463 ద్వారా నూతన పాలక వర్గాన్ని ఎంపిక చేస్తూ శనివారం ప్రకటన చేసింది. వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఉద్యమకారులకు ప్రాధాన్యం కల్పించింది. చైర్మన్‌గా దుగ్గొండి మండలానికి చెందిన పొన్నం మొగిలిముదిరాజ్, వైస్ చైర్మన్‌గా నల్లబెల్లి మండలానికి చెందిన పాలెపు రాజేశ్వర్‌రావు, డైరెక్టర్లుగా పెరుమాండ్ల ప్రభాకర్‌రెడ్డి, మాదాసి కుమారస్వామి, తోటకూరి రాజు, వాసం కరుణ, వల్లాల కరుణాకర్, మోర్తాల రామారావు, బోడ కల్పన, ఎస్‌కే.షరీఫ్, జెరిపోతుల వెంకటేశ్వర్లు, పెండెం వెంకటేశ్వర్లు, అడ్తిదారులు ఏడాకుల మల్లారెడ్డి, దొడ్డ రవీందర్ ఎన్నికయ్యారు. కాగా, కొన్ని సంవత్సరాలుగా మార్కెట్ కమిటీ లేకపోవడంతో ప్రతిపక్షాలు విమర్శలు చేశాయి. ఉద్యమకారులకు గౌరవం దక్కేవిధంగా ఎమ్మెల్యే పెద్ది మార్కెట్ కమిటీని నియమించడంతో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

సంస్కృతీసంప్రదాయాలకు పెద్దపీట



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న రవీందర్‌రావు

- డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

వర్ధన్నపేట : సంస్కృతీసంప్రదాయాలను సీఎం కేసీఆర్ పరిరక్షించి పెద్దపీట వేశారని డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు అన్నారు. వర్ధన్నపేట పట్టణంలోని రెండో వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ అంగోతు అరుణ, ఎంపీపీ అన్నమనేని అప్పారావు, వార్డు కౌన్సిలర్ తోటకూరి రాజమణి, కమిషనర్ ఇజోనాతో కలిసి శనివారం మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మార్నేని రవీందర్‌రావు తెలంగాణ రాష్ట్రంలో బతుకమ్మ, దసరా ఘనంగా జరుపుకునే పండుగలన్నారు. అన్ని పండుగలకు ప్రభుత్వం దుస్తులను అందిస్తుందని తెలిపారు. బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ సాధించి రాష్ట్రాన్ని మరింత ముందుకు తీసుకుపోతుందని పేర్కొన్నారు. అనంతరం పట్టణంలోని ఆల్ఫోర్స్ ఉన్నత పాఠశాలలో క్రీడాకారులకు కేసీఆర్ స్పోర్ట్స్ కిట్స్‌ను ఆయన అందజేశారు.

కొరడా ఝుళిపిస్తున్నా.. కొద్ది రోజులే..

- సస్పెన్షన్ వేటు వేస్తున్నా మారని కొందరు పోలీసుల తీరు
- పరిపాటిగా మారిన భూ వివాదాలు, సెటిల్‌మెంట్లు
- తాజాగా నర్మెట సీఐ నాగబాబు, ఎస్సై అనిల్ పై సస్పెన్షన్ వేటు
- వివాదంలో కొందరు నగర సీఐలు..?..భూ దందాదారులతో చెట్టాపట్టాల్..

సాక్షిప్రతినిధి, వరంగల్: భూ దందాలు, సెటిల్‌మెంట్లకు పెట్టింది పేరుగా మారిన కొందరు పోలీస్ అధికారులను గాడిన పెట్టేందుకు సీపీ ఏవీ రంగనాథ్ చట్టపరమైన చర్యలు చేపడుతున్నారు. అక్రమార్కులను సక్రమ మార్గాన నడిపించేందుకు తరచూ కొరడా ఝుళిపిస్తున్నా.. అది కొద్దిరోజులకే పరిమితమవుతోంది. బాధితులు ఫిర్యాదు చేస్తే చాలు స్పందించి మునుపెన్నడూ లేని విధంగా క్షేత్రస్థాయి విచారణ జరిపి సస్పెన్షన్ వేటు వేస్తున్నా కొందరి తీరులో మార్పు రావడం లేదు. వరంగల్ కమిషనరేట్ పరిధిలో ఇప్పటికే కానిస్టేబుల్ నుంచి ఇన్‌స్పెక్టర్ల వరకు పలువురిపై సస్పెన్షన్ వేటు పడింది. ఉద్యోగులు, సామాన్యులు రూపాయి రూపాయి పోగేసుకుని సొంతింటిని నిర్మించుకోవాలని కొనుగోలు చేసిన భూములకు గతంలో చాలాచోట్ల భద్రతా లేకుండా పోయింది. భూకబ్జాలు, ఆక్రమణలపై పోలీసు కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించడంతో ఇంటిస్థలాలు భద్రంగా ఉంటాయనే భరోసా కలుగుతున్న తరుణంలో కొందరు పోలీసులే కబ్జాదారులకు సహకరిస్తూ సస్పెన్షన్లకు గురవుతుండడం చర్చనీయాంశమవుతోంది.

కలకలం రేపుతున్న సస్పెన్షన్లు..

అయినా కావాలి కాసులు..

హద్దుమీరుతున్న పోలీసులను గాడిన పెట్టేందుకు సీపీ రంగనాథ్ చేపడుతున్న చర్యలు కలకలం రేపుతున్నా.. కొద్ది రోజులకే మళ్లీ కాసుల కోసం కక్కుర్తిపడి కొందరు వివాదాస్పదమవుతున్నారు.

- భూ దందాలు, సెటిల్‌మెంట్ల వ్యవహారంలో మొదటి వేటు గీసుకొండ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన ఆర్.వెంకటేశ్వర్లుపై పడింది. భూ కబ్జాదారులతో పాటు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారికి సహకరిస్తున్నారనే ఆరోపణలకు తోడు ఓ మహిళా ఎస్సైతో హద్దులు మీరి వ్యవహరించారన్న ఫిర్యాదులు కూడా ఉన్నాయి. ఈ కేసులో ఆ మహిళ ఎస్సైపైన వేటు పడింది.
- ఆ తర్వాత నర్సంపేట పోలీసు స్టేషన్‌లో పనిచేసిన ఏఎస్సై నాగరాణి ఒకరి వద్ద డబ్బులు తీసుకుని ఇవ్వకపోగా ఆమెపై హనుమకొండ స్టేషన్‌లో కేసు నమోదు కాగా సస్పెండ్ చేశారు.
- పీడీఎస్ బియ్యం దందా, గుడుంబా తయారీదారుల నుంచి డబ్బు గుంజడం, బీమా స్కాంలో నిందితులకు స్టేషన్ బెయిల్ ఇవ్వడానికి ముడుపులు పుచ్చుకున్న నల్లబెల్లి ఎస్సై రాజారాంను సీపీ సస్పెండ్ చేశారు.
- భూ తగాదాల్లో తలదూర్చారన్న ఫిర్యాదుపై మట్టెవాడ సీఐ సీహెచ్ రమేశ్‌ను.. ఇవే రకమైన ఆరోపణల్లో కేయూసీ సీఐ దయాకర్‌ను సీపీ సస్పెండ్ చేశారు.
- టాస్క్‌ఫోర్స్‌లో సీఐగా ఉన్న సీఐ నరేష్‌తోపాటు హెచ్‌సీ శ్యాంసుందర్, మరో ఇద్దరు కానిస్టేబుళ్లను భూసెటిల్‌మెంట్లు, వసూళ్ల ఆరోపణలపై సస్పెండ్ చేశారు.
- రంగురాళ్ల వ్యాపారిని బెదిరించిన ఘటనలో కమిషనరేట్ రిజర్వు ఇన్‌స్పెక్టర్ సతీష్‌పై సుబేదారి పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేయించి, రిమాండ్‌కు తరలించి సస్పెండ్ చేశారు.
- హసన్‌పర్తి, ధర్మసాగర్ ఇన్‌స్పెక్టర్లను వీఆర్‌కు బదిలీ చేశారు.
- తాజాగా భూసంబంధిత విషయాల్లో బాధితుల పక్షాన కాకుండా అక్రమార్కులకు వత్తాసు పలికారన్న ఫిర్యాదులపై విచారణ జరిపించి నర్మెట సీఐ పాటి నాగబాబు, ఎస్సై గైకాడి అనిల్ కుమార్‌ను సస్పెండ్ చేస్తూ వరంగల్ సీపీ ఏవీ రంగనాథ్ శనివారం ఉత్తర్వులు జారీ చేయడంతో పోలీస్ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.

వివాదంలో నగర ఇన్‌స్పెక్టర్లు..?

సెంట్రల్ జోన్ పరిధిలోని ఇద్దరు నగర ఇన్‌స్పెక్టర్ల వ్యవహారం వివాదాస్పదం అవుతోంది. భూ కబ్జాదారులతో దోస్తీ చేసి.. భూ ఆక్రమణల కోసం కొందరు అసాంఘిక శక్తులతో టీంలుగా ఏర్పడ్డారన్న ఆరోపణలపై అక్కడ పనిచేసిన ఇన్‌స్పెక్టర్లపై గతంలో బదిలీ, సస్పెన్షన్ వేటు వేశారు. ఆ ఠాణాల్లో పోస్టింగ్ పొందిన వారు తిరిగి అవే తరహా కార్యకలాపాలను ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. భూకబ్జాదారులను కట్టడి చేసేందుకు 'అవసరమైతే పీడీ యాక్టు నమోదు చేయాలన్న సీపీ ఆదేశాలను సొమ్ము' చేసుకుంటున్నారు. ఇటీవల భూ క్రయవిక్రయాల్లో వివాదాస్పదుడని పేరున్న ఓ వ్యాపారిని పిలిపించిన ఓ ఇన్‌స్పెక్టర్‌పై ఫిర్యాదులున్నాయి.. పీడీ యాక్టు పెడతానని పెద్దమొత్తంలో డిమాండ్ చేసి కొంత ముట్టజెప్పాకే శాంతించారని తెలిసింది. మరో ఇన్‌స్పెక్టర్ పాత రౌడీషీటర్ల కౌన్సెలింగ్ పేరిట ఇద్దరు భూదందాదారులను ఇదే తరహాలో బెదిరించినట్లు తెలిసింది.

సీఐ, ఎస్సై సస్పెన్షన్

- ఉత్తర్వులు జారీ చేసిన వరంగల్ సీపీ
- భూవివాదంలో జోక్యం చేసుకున్నందుకు వేటు



సీఐ నాగబాబు



ఎస్సై అనిల్‌కుమార్

నర్మెట: భూవివాదంలో అక్రమార్కులకు వత్తాసు పలికినందుకు నర్మెట సీఐ పాటి నాగబాబు, ఎస్సై గైకాడి అనిల్‌కుమార్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఈమేరకు వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. బాధితుడు, గ్రామస్తుల కథనం ప్రకారం.. మండల పరిధి అమ్మాపూర్‌కు చెందిన చెక్కిళ్ల లక్ష్మయ్య, వెంకటేశ్వర్లు, రవీందర్ అన్నదమ్ములు. 35 ఏళ్ల క్రితం లక్ష్మయ్య, వెంకటేశ్వర్లు హైదరాబాద్‌కు వెళ్లి స్థిరపడ్డారు. ఈక్రమంలో తల్లిదండ్రుల బాధ్యత చూసుకొమ్మని తమ్ముడు రవీందర్‌కు చెప్పారు. ఇందుకుగాను అమ్మాపురంలోని తమ పాలుకు వచ్చిన భూమిని అప్పగించారు. అలాగే.. హైదరాబాద్‌లోని ఆస్తి తాము తీసుకుంటామని చెప్పారు. ఈక్రమంలో గతేడాది గ్రామానికి వచ్చిన లక్ష్మయ్య, వెంకటేశ్వర్లు గతంలో తాము అప్పగించిన భూమి ఇవ్వాలని తమ్ముడిని నిలదీశారు. దీంతోపాటు పోలీసులను ఆశ్రయించారు. అయితే.. సీఐ నాగబాబు, ఎస్సై అనిల్‌కుమార్.. రవీందర్‌ను పిలిపించి మాట్లాడారు. గ్రామంలో తనకు ఇచ్చిన భూమికి బదులు తన సోదరులు హైదరాబాద్‌లో భూమి తీసుకున్నారని, నాటి నుంచి సేద్యం చేసుకుంటున్నానని రవీందర్ చెప్పాడు. అయినా.. వినిపించుకోకుండా.. 3.10 ఎకరాల (సర్వే నం 339, 341, 347) భూమి ధరణి పోర్టల్‌లో లక్ష్మయ్య, వెంకటేశ్వర్లు పేరుతో ఉందని సీఐ, ఎస్సై వారి వైపే మాట్లాడారు. అంతేకాకుండా రవీందర్, అతడి భార్య, కుమారులపై కేసులు నమోదు చేశారు. దీంతో ఆందోళనకు గురైన బాధితుడు వరంగల్ సీపీ రంగనాథ్‌ను ఆశ్రయించాడు. క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని కమిషనరేట్ పరిధి డీసీపీ, ఏసీపీ స్థాయి అధికారులను ఆదేశించారు. ఈక్రమంలో బుధవారం గ్రామానికి చేరుకున్న పోలీసు అధికారులు గ్రామంలో విచారణ చేపట్టారు. స్థానికుల వాంగ్మూలం నమోదు చేసుకున్నారు. ఆ నివేదికను అందుకున్న సీపీ.. సీఐ, ఎస్సైని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

గతంలో ఇద్దరు కూడా..

ఇదిలా ఉండగా.. గతంలో నర్మెట ఎస్సైగా పనిచేసిన సీహెచ్.రవికుమార్ లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా ఏసీబీ అధికారులకు చిక్కాడు. అలాగే ఇటీవల ఓ కేసులో బచ్చన్నపేట ఎస్సైగా పనిచేసిన సిరిపురం నవీన్‌కుమార్ (నర్మెట నుంచి బచ్చన్నపేటకు బదిలీపై వెళ్లారు) సస్పెన్షన్‌కు గురయ్యాడు. ఇందుకు భూవివాదంలో జోక్యం చేసుకోవడమే కారణం.

రేపు 'కాజీపేట–హడప్సర్' ఎక్స్‌ప్రెస్ ప్రారంభం

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్ మీదుగా ఈనెల 9 నుంచి ట్రై వీక్లీ రైలును నడిపించనున్నట్లు శనివారం రాత్రి అధికారులు తెలిపారు. ఈరైలును ట్రై వీక్లీగా రైల్వే అధికారులు నడిపించనున్నారు. కాగా.. ఈనెల 9న సోమవారం ఉదయం 11 గంటలకు సికింద్రాబాద్‌లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రైలును జెండా ఊపి ప్రారంభిస్తారు. అనంతరం 11:15 గంటలకు కాజీపేట జంక్షన్‌కు చేరుకుంటుంది. ఇప్పటి వరకు హైదరాబాద్–హడప్సర్ మధ్య ప్రయాణించే ఈఎక్స్‌ప్రెస్‌ను కాజీపేట జంక్షన్ వరకు పొడిగించి కాజీపేట నుంచి కొత్త రైలుగా.. ప్రవేశపెట్టి నడిపించేందుకు శ్రీకారం చుట్టారు. 9న కాజీపేటలో ప్రారంభమయ్యే కాజీపేట–మహారాష్ట్రలోని హడప్సర్ (17014) ఎక్స్‌ప్రెస్ ప్రతీ సోమ, గురు, శనివారాల్లో సాయంత్రం 6:15 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10:50 గంటలకు హడప్సర్‌కు చేరుకుంటుంది.

మణుగూరు-బెల్గాం ఎక్స్‌ప్రెస్..



- కాజీపేట-మణుగూరు మధ్య రద్దు

కాజీపేట రూరల్: కాజీపేట సబ్ డివిజన్ పరిధిలో జరుగుతున్న ఇంజనీరింగ్ వర్క్స్, మూడో రైల్వే లైన్ మార్గం కారణంగా కాజీపేట జంక్షన్ మీదుగా ప్రయాణించే మణుగూరు-బెల్గాం ఎక్స్‌ప్రెస్‌ను దూరం తగ్గించి నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు శనివారం తెలిపారు. సెప్టెంబర్ 30 నుంచి నవంబర్ 30వ తేదీ వరకు బెల్గాం-మణుగూరు (07335) ఎక్స్‌ప్రెస్‌ను కాజీపేట వరకు నడిపిస్తూ కాజీపేట-మణుగూర్ మధ్య రద్దు చేసినట్లు తెలిపారు. అదే విధంగా మణుగూరు-బెల్గా (07336) ఎక్స్‌ప్రెస్ అక్టోబర్ 1 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు కాజీపేట వరకు నడిపిస్తూ మణుగూరు-కాజీపేట మధ్య రద్దు చేసినట్లు రెల్వే అధికారులు తెలిపారు.

ప్రమాదమా..హత్యా ?

- బైక్‌తో నీటిగుంతలో పడిన కుటుంబం
- భార్య, కుమారుడి మృతి.. భర్త క్షేమం
- పరకాల మండలం వెల్లంపల్లి శివారులో ఘటన
- అల్లుడిపై మృతురాలి కుటుంబీకుల అనుమానం



భార్య, కొడుకుతో రమేష్ (ఫైల్)

పరకాల : ఓ వ్యక్తి తన భార్యను ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించాడు. అనంతరం ద్విచక్ర వాహనంపై రాత్రి ఇంటికి ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో బయలుదేరిన గంటలోనే ద్విచక్ర వాహనం నీటి గుంతలో పడింది. ఈ ప్రమాదంలో భార్య, కుమారుడు మృతి చెందగా భర్త క్షేమంగా బయటపడ్డారు. కాగా, ఈ ఘటనలో అల్లుడికి (మృతురాలి భర్త) ఎలాంటి గాయాలు కాకపోవడంతో పాటు రాత్రి సమయంలో ఆస్పత్రి నుంచి ఇంటికి తీసుకు రావడంపై మృతురాలి కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం వరంగల్ శంభునిపేటకు చెందిన పస్తరి సమ్మక్క, రాజేందర్ దంపతుల పెద్ద కూతురు రాజేశ్వరి(21)ని మూడున్నర సంవత్సరాల క్రితం నడికూడ మండలం నర్సక్కపల్లికి చెందిన తూర్పాటి రమేష్‌కు ఇచ్చి వివాహం చేశారు. దంపతులు ఆరు నెలల వరకు అన్యోన్యంగా ఉన్నారు. అనంతరం మనస్పర్థలు ప్రారంభమయ్యాయి. రమేష్‌కు మరో యువతితో పరిచయం కావడంతో ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ దంపతులకు మూడేళ్ల కుమారుడు సాయి ఇషాన్ ఉన్నాడు. ఈ క్రమంలో రాజేశ్వరి మళ్లీ గర్భం దాల్చడంతో శుక్రవారం వరంగల్‌లోని సీకేఎం ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించాడు. అనంతరం రాత్రి వేళలో ఇంటికి బయలుదేరుతుండగా వద్దని మృతురాలి అక్కాచెల్లెలు ఎంత వారించినా పట్టించుకోలేదు. ద్విచ్రవాహనంపై భార్య, కుమారుడిని తీసుకుని బయలుదేరాడు. ఈ క్రమంలో రాత్రి 9 గంటలకు ద్విచక్రవాహనం పరకాల మండలం వెల్లంపల్లి క్రాస్ సమీపంలోని నేతాని కుంటలో పడింది. ఈ ఘటనలో



పోలీసు స్టేషన్ వద్ద మృతురాలి కుటుంబ సభ్యులు

భార్య రాజేశ్వరి, కుమారుడు ఇషాన్ మృతి చెందగా రమేష్ క్షేమంగా బయటపడ్డాడు.

రాత్రి కుమారుడు, ఉదయం తల్లి మృతదేహాలు లభ్యం

నీటి గుంతలో పడగానే రమేష్ ఫోన్ చేసి ఇరు కుటుంబాలకు సమాచారం అందించాడు. వారు హుటాహుటినా ఘటనా స్థలికి చేరుకుగానే రాజేశ్వరి దొరకడం లేదని.. సాయిఇషాన్ మృతదేహంతో విలపిస్తూ కనిపించాడు. సమాచారం అందుకున్న పరకాల పోలీసులు రాత్రి నుంచి అగ్నిమాపక సిబ్బంది సాయంతో గాలింపు చేపట్టగా శనివారం ఉదయం 10 గంటలకు రాజేశ్వరి మృతదేహం లభ్యమైంది. ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పరకాలకు తరలించారు. కాగా, తన కుమార్తె, మనువడి మృతికి అల్లుడే కారణమంటూ మృతురాలి తల్లి సమ్మక్క పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

పోలీసుస్టేషన్ వద్ద ఉద్రిక్తత..

ద్విచక్రవాహనం నీటి గుంతలో పడి తల్లి, కుమారుడు మృతి చెందాడని తెలుసుకున్న రాజేశ్వరి బంధువులు ఆమె భర్తపై అనుమానం వ్యక్తం చేస్తూ పెద్ద సంఖ్యలో పరకాల పోలీసుస్టేషన్ వద్దకు చేరుకున్నారు. అతడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పోలీసుస్టేషన్‌లో రమేష్ ఆత్మహత్యాయత్నం

ఘటనపై మృతురాలి బంధువులు అనుమానం వ్యక్తం చేయడంతో పోలీసులు రమేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. దీంతో తనపై అనవసరపు నిందలు వేస్తున్నారంటూ పోలీసు స్టేషన్‌లోనే రమేష్ బ్లేడ్‌తో కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.

వరకట్న వేధింపులతో వివాహిత ఆత్మహత్య

తరిగొప్పుల : వరకట్న వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పోతారంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై దూదిమెట్ల రమేష్, గ్రామస్తుల కథనం ప్రకారం.. బచ్చన్నపేటకు చెందిన కర్రె అంజయ్య కుమార్తె నిఖిత (22)ను 22 నెలల క్రితం పోతారం గ్రామానికి చెందిన పాకాల నరేష్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. సజావుగా సాగుతున్న కాపురంలో నాలుగు నెలల తర్వాత భర్త నరేష్, అత్త నర్సవ్వలు అదనపు కట్నం తేవాలని నిఖితను నిత్యం వేధించేవారు. ఈ విషయమై పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించగా బచ్చన్నపేటలోని ఓ ప్లాటును నిఖిత పేరున రిజిస్ట్రేషన్ చేయించారు. అయినా భర్త, అత్త ప్రవర్తనలో మార్పు రాలేదు. కాగా శుక్రవారం ఉదయం నిఖితను తన భర్త, అత్త కొట్టి ఇష్టం వచ్చినట్లు తిట్టడంతో మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన వారు చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది. ఎస్సై ఘటనా స్థలం వద్దకు వెళ్లి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

భర్త వేధింపులు.. ఖిలాషాపూర్‌లో భార్య..



రజిత (ఫైల్)

రఘునాథపల్లి: భర్త వేధింపులు తాళలేక భార్య ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండలంలోని ఖిలాషాపూర్‌లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం హనుమకొండ జిల్లా వేలేర్ మండలం కమ్మరిపేట గ్రామానికి చెందిన అల్లిబిల్లి రజిత (33)ను 14 సంవత్సరాల క్రితం మండలంలోని ఖిలాషాపూర్‌కు చెందిన రవీందర్‌కు ఇచ్చి వివాహం చేశారు. అయితే సంతానం కావడం లేదని కొంతకాలంగా భర్త వేధిస్తున్నాడు. దీంతో రజిత పలుమార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గ్రామ పెద్దలు చెప్పినా భర్త వేధింపులు ఆగడం లేదు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం మద్యం సేవించి సంతానం కలుగడం లేదంటూ దూషించాడు. దీంతో మనస్తాపానికి గురైన రజిత శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహ్యాతకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు తలుపులు విరగ్గొట్టి రజితను ఉరినుంచి విడదీశారు. అప్పటికే అపస్మారక స్థితికి చేరుకోగా ఓ వాహనంలో ఆస్పత్రికి తీసుకెళ్లే క్రమంలో మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి తండ్రి చీటి రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రఘుపతి తెలిపారు.

దాయాదులు తిట్టారని..

- వివాహిత ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ మృతి



రమ(ఫైల్)

సంగెం: దాయాదులు తిట్టి అవమానపరిచారని మనోవేదనకు గురైన ఓ వివాహిత.. పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని ఆశాలపల్లిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన దండు వీరస్వామి, సమ్మయ్య, సదయ్య అన్నదమ్ములు. వీరిలో సమ్మయ్య, సదయ్యకు ఇటీవల గృహలక్ష్మి పథకంలో ఇళ్లు మంజూరయ్యాయి. ముగ్గు పోసుకుని పిల్లర్లు నిర్మిస్తున్న క్రమంలో వీరస్వామి వైపు ఉన్న హద్దును సమ్మయ్య హద్దుతో సమానంగా జరపాలని, అందరం భూమిని సమానంగా తీసుకుందామని అడగ్గా.. వీరస్వామి, అతని భార్య వసంత, సదయ్య, అతని భార్య స్వరూప ససేమిరా అన్నారు. ఈ విషయంలో సమ్మయ్య భార్య రమ(47)ను నలుగురు వీరస్వామి, వసంత, సదయ్య, స్వరూప దూషించారు. దీంతో ఈ ఘటనపై ఈ నెల 6వ తేదీన పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. ఇక్కడ కూడా 'మీరు చచ్చినా హద్దులు జరపమని' సమ్మయ్య, రమ దంపతులను దూషించారు. దీంతో అవమాన భారం భరించలేక రమ శుక్రవారం సాయంత్రం పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. గమనించిన సమ్మయ్య స్థానికుడు ప్రశాంత్ సాయంతో ఎంజీఎం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మృతి చెందింది. ఈ ఘటనపై సమ్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై భరత్ తెలిపారు.

అంగన్‌వాడీ విద్యార్థికి తేలు కాటు

మరిపెడ రూరల్: మరిపెడ మండలం ఉల్లెపల్లి గ్రామానికి చెందిన అంగన్‌వాడీ-3 కేంద్రంలో విద్యార్థి కోల ధనుష్ శనివారం తేలుకాటుకు గురయ్యాడు. గమనించిన అంగన్‌వాడీ కేంద్ర నిర్వాహకులు వెంటనే స్థానికంగా చికిత్స చేయించారు. బాలుడి పరిస్థితి నిలకడగా ఉందని వారు పేర్కొన్నారు. కాగా, అంగన్‌వాడీ కేంద్ర నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగానే బాలుడు తేలుకాటుకు గురయ్యాడని గ్రామస్తులు ఆరోపించారు. వారి పర్యవేక్షణ లేకపోవడంతో పిల్లలు బయటకు రాగా, అందులో ఓ బాలుడు తేలుకాటుకు గురయ్యాడని మండిపడ్డారు.

రూ.51.12 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం

- పెంబర్తి, సూదన్‌పల్లిలో నిరసనలు
- ప్రతి ఒక్కరికీ దళితబంధు : ఎమ్మెల్యే అరూరి



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలంలోని పది గ్రామాల్లో శనివారం ఎమ్మెల్యే అరూరి రమేశ్ సుడిగాలి పర్యటన చేశారు. వంగపహాడ్, ఆయా గ్రామాల్లో సుమారు రూ.50.12 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. సూదన్‌పల్లి, గంటూరుపల్లి, జయగిరి, భైరాన్‌పల్లి, హెచ్‌సీ తండా, సిద్ధాపురం గ్రామాల్లో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రూ.25 కోట్లతో చేపడుతున్న నాగారం పెద్ద చెరువు అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ దళితబంధు, గృహలక్ష్మి పథకం వర్తింపజేస్తామన్నారు. అభివృద్ధి,సంక్షేమానికి సమ ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు.

అడ్డుకునేందుకు యత్నం

పెంబర్తి ఎస్సీ కాలనీ వద్ద ఎమ్మెల్యే కాన్వాయ్ వెళ్తుండగా.. స్థానికులు అడ్డుకునేందుకు యత్నించారు. ఈక్రమంలో స్థానికులను పోలీసులు నెట్టి వేశారు. దళిత బంధు, డబుల్‌బెడ్రూమ్ ఇవ్వాలని స్థానికులు ఎమ్మెల్యే ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అదేవిధంగా సూదన్‌పల్లిలో కోతుల బెడద ఎక్కువైందని స్థానికులు ఎమ్మెల్యే ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పెద్ది తిరుపతమ్మ, బొల్లవేణి రాణి, పెసరు శ్రీనివాస్‌రెడ్డి, అరుణ్‌కుమార్, ధనలక్ష్మి, సాంబారెడ్డి, జోరిక పూల, ఎంపీపీ కేతపాక సునీత, జెడ్పీటీసీ సభ్యురాలు రేణుకుంట్ల సునీత, వైస్ ఎంపీపీ రత్నాకర్‌రెడ్డి, నాయకులు జంగా కుమార్, బండి రజనీకుమార్, మేకల భగవాన్‌రెడ్డి, మేర్గు రాజేశ్, జక్కు రమేశ్, శరత్‌రెడ్డి, అంచూరి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ పాలన దేశానికే ఆదర్శం



పెద్దవంగర: సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి



తొర్రూరు : వైద్యులను సన్మానిస్తున్న మంత్రి దయాకర్‌రావు

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి దయాకర్‌రావు

పెద్దవంగర: సీఎం కేసీఆర్ పాలన దేశానికే ఆదర్శమని, సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో సబ్బండవర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉన్నారని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సాయిగార్డెన్‌లో నిర్వహించిన ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో కరెంటు, సాగునీరు, పెట్టుబడులకు రైతులు ఇబ్బందులు పడ్డారని, ఇప్పుడు ఆ గోస తీరి ఆనందంతో ఉన్నారన్నారు. ఈ సంక్షేమ పథకాలతో పాటు ఇప్పుడు బీఆర్‌ఎస్ ప్రవేశపెట్టనున్న మేనిఫెస్టోను చూసి ప్రత్యర్థి పార్టీల్లో దడ పుడుతుందన్నారు. బీఆర్‌ఎస్ పథకాలు అమలు కావాలంటే కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని పేర్కొన్నారు. సోమవారం పాలకుర్తి నియోజక వర్గంలో ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ పర్యటిస్తారని, నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున స్వాగతం పలికి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఐలయ్య, రామచంద్రయ్య శర్మ, సోమనర్సింహారెడ్డి, శ్రీనివాస్, యాదగిరి రావు, పాకనాటి సోమారెడ్డి, బొమ్మకల్లు ఎంపీటీసీ రవీందర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

వైద్య రంగాన్ని బలోపేతం చేస్తున్న ప్రభుత్వం

తొర్రూరు : వైద్య, ఆరోగ్య రంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం బలోపేతం చేస్తోందని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బ్రాహ్మణ అఫీషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్, ప్రైవేట్ డాక్టర్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో శనివారం డివిజన్ కేంద్రంలోని ఎల్‌వైఆర్ గార్డెన్‌లో మెగాహెల్త్ క్యాంపు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆరోగ్యశ్రీ ట్రస్టు చైర్మన్ డాక్టర్ నెమరుగొమ్ముల సుధాకర్‌రావు, కలెక్టర్ శశాంకలతో కలిసి మంత్రి మాట్లాడారు. వైద్య, విద్య పేదలకు అందేలా మెడికల్, నర్సింగ్ కళాశాలలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఇప్పటి వరకు 21 వైద్య కళాశాలలు అందుబాటులోకి వచ్చాయన్నారు. తొర్రూరులో 100 పడకల ఆస్పత్రి, పాలకుర్తిలో 50 పడకల ఆస్పత్రి మంజూరయ్యాయని, అతి త్వరలో సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, ఆర్డీఓ నర్సింగరావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ మురళీధర్, బోప్పా రాష్ట్ర అధ్యక్షుడు డి.రాధాకృష్ణ మూర్తి, ప్రధాన కార్యదర్శి వింజమూరి సుధాకర్, వైద్యులు బ్రాహ్మణ ప్రతినిధులు పాల్గొన్నారు.

కేటీఆర్ సభ ఏర్పాట్ల పరిశీలన

ఈ నెల 9న తొర్రూరులో పలు అభివృద్ధి పనులకు మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేయనున్నారు. ఇందులో భాగంగా తొర్రూరు పాలకేంద్రం సమీపంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నారు. ఈ నేపథ్యంలో సభాస్థలిని శనివారం కలెక్టర్ శశాంకతో కలిసి మంత్రి ఎర్రబెల్లి పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలిచ్చారు.

బీసీల అభివృద్ధికి ఎజెండా ప్రకటించాలి



మాట్లాడుతున్న తిరునహరి శేషు

- బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ తిరునహరి శేషు

హన్మకొండ: బీసీల సమగ్రాభివృద్ధికి రాజకీయ పార్టీలు చేపట్టనున్న ఎజెండా, పార్టీ వైఖరిని ప్రకటించాలని బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానంగా మూడు రాజకీయ పార్టీలు బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ.. బీసీల అభివృద్ధి, సంక్షేమంపై స్పష్టమైన విధానం ప్రకటించాలన్నారు. బీసీల అభ్యున్నతికి పార్టీలు తీసుకోవాల్సిన, చేపట్టాల్సిన అంశాలను ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీకి స్వయంగా ఇవ్వగా.. సీఎం కేసీఆర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డికి మెయిల్ ద్వారా వినతిపత్రాలు పంపామన్నారు. బీఆర్‌ఎస్.. బీసీలకు కేవలం 22 సీట్లలో మాత్రమే అవకాశం కల్పించిందన్నారు. కాంగ్రెస్, బీజేపీలైనా ప్రాధాన్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు నూతనకంటి ఆనందం, చిన్నాల యశ్వంత్, దారబోయిన సతీష్, ఐలాపురం వేణుచారి, దాడబోయిన శ్రీనివాస్, వంగపండ్ల నరేందర్ పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో గొడవ..

- ఓ విద్యార్థిని చితకబాదిన ఇతర విద్యార్థులు
- పరిస్థితి ఉద్రిక్తం.. ప్రిన్సిపాల్ దృష్టికెళ్లిన ఘటన?

కేయూ క్యాంపస్ : హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్‌సైన్స్ కళాశాలలో శనివారం సాయంత్రం విద్యార్థుల మధ్య గొడవ జరిగింది. బీఏ మొదటి సంవత్సరం విద్యార్థులకు.. బీఏ ద్వితీయ ,ఫైనల్ ఇయర్ విద్యార్థులు ఆ కళాశాలలో ఆడిటోరియంలో వెల్‌కమ్ పార్టీ నిర్వహించారు. మధ్యాహ్నం 3గంటల వరకు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆ తరువాత చాలా మంది విద్యార్థులు కళాశాల ఆవరణకు చేరుకున్నారు. కొందరు ఫొటోలు దిగుతున్నారు. ఈ సమయంలో ఏమైందో తెలియదుగాని ఓ ఫస్టియర్ విద్యార్థిని ద్వితీయ సంవత్సరం విద్యార్థులుగా భావిస్తున్న కొందరు చితకబాదారని సమాచారం. ఆ విద్యార్థిని వెంబడించి మరి చితకబాదారని తెలుస్తోంది. దీంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ విషయం తెలుసుకున్న పలువురు అధ్యాపకులు ఘటనాస్థలికి చేరుకుని ఈ గొడవను నిలువరించారని సమాచారం. అనంతరం విద్యార్థులను కళాశాల నుంచి బయటికి పంపారు. కాగా, విద్యార్థిని ఎందుకు చితకబాదారనే విషయం తెలియరాలేదు. ఈ గొడవ విషయంపై ఆ కళాశాల ప్రిన్సిపాల్ బన్న ఐలయ్య దృష్టికి కూడా వెళ్లినట్లు సమాచారం. గొడవ పడిన విద్యార్థులను ఈనెల 8న లేదా 9న పిలిపించి మాట్లాడాలని యోచిస్తున్నారని సమాచారం. దీనిపై ప్రిన్సిపాల్ ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

కాంట్రాక్టు లెక్చరర్ల నిరసన

- అరెస్టు అప్రజాస్వామికం
- 'కుక్టా' జేఏసీ చైర్మన్ కరుణాకర్‌రావు



నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు లెక్చరర్లు

కేయూ క్యాంపస్: తెలంగాణ రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని 'కుక్టా' జేఏసీ చైర్మన్ డాక్టర్ పి. కరుణాకర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని ఆ కళాశాలలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కరుణాకర్‌రావు మాట్లాడుతూ కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేస్తామని గతంలో ఇచ్చిన హామీని సీఎం కేసీఆర్ నిలబెట్టుకోవాలన్నారు. ఈనెల 6న హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో కాంట్రాక్టు లెక్చరర్లు ఆమరణ దీక్ష చేస్తున్న వారిని అరెస్టు చేయడం అప్రజాస్వామికమన్నారు. కేయూ కుక్టా జేఏసీ నుంచి ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల్లోని కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేసిన మాదిరిగానే యూనివర్సిటీల కాంట్రాక్టు లెక్చరర్లను కూడా రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో కుక్టా జేఏసీ బాధ్యులు మాదాసి కనకయ్య, బాధ్యులు ఎల్.జితేందర్, ఎస్.సురేష్, ఎ కొమురయ్య, పి.ప్రవీణ్‌కుమార్, ఎస్.సతీష్‌కుమార్, శ్రీధర్‌రావు, ఎ.శ్రీలత, ఆర్.మంజుల, సాయికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

విచారణ కమిటీని స్వాగతిస్తున్నాం

- ఉద్యమకారుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వెంకటనారాయణ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ అడ్మిషన్ల అవకతవకలపై విచారణ కమిటీని నియమిస్తామని హనుమకొండ పర్యటనకు వచ్చిన రాష్ట్ర పురపాలక, ఐటీశాఖ మంత్రి కేటీఆర్ వెల్లడించడాన్ని స్వాగతిస్తున్నామని తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆచార్య కూరపాటి వెంకటనారాయణ తెలిపారు. ఈమేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేయూలో పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవకతవకలు జరిగాయని విద్యార్థి జాక్ నాయకులు దీక్షలు కొనసాగిస్తున్నారన్నారు. ఈ క్రమంలో పీహెచ్‌డీ అడ్మిషన్ల అవకతవకలపై విచారణ కమిటీని నియమిస్తామని మంత్రి కేటీఆర్ ప్రకటించారన్నారు. అయితే కమిటీని త్వరగా నియమించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాగా, కేయూ పీహెచ్‌డీ అడ్మిషన్లలో జరిగిన అవకతవకలపై విచారణ కమిటీని నియమించి సమస్యను త్వరగా పరిష్కరించి విద్యార్థులకు న్యాయం చేయాలని కేయూ రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్ (కుర్తా) అధ్యక్షుడు సదానందం కోరారు.